సాక్షి
అనకాపల్లి

గురువారం । 23 । నవంబర్ । 2023



అర్జీదారుల సంతృప్తే లక్ష్యం

యలమంచిలిలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 91 వినతులు వచ్చాయి. జేసీ తదితర అధికారులు పాల్గొన్నారు. II లో



నిర్లక్ష్యంగా దూసుకొచ్చి..

విశాఖలో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఆటో దూసుకొచ్చి.. లారీని ఢీకొట్టడంతో నలుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. II లో



వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది.

న్యూస్‌రీల్

ఇన్‌చార్జి డీఎఫ్‌వోగా లక్ష్మణ్ బాధ్యతల స్వీకారం



నర్సీపట్నం: జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌వో)గా లక్ష్మణ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల డీఎఫ్‌వో రాజారావు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఆయన స్థానంలో అనకాపల్లి సోషల్ ఫారెస్టు డీఎఫ్‌వోగా పనిచేస్తున్న లక్ష్మణ్‌ను ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 42 వేల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే 22 వేలు మొక్కలు నాటామన్నారు. డిసెంబర్ నెలాఖరు నాటికి లక్ష్యం పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో నగర వనాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. బయ్యవరం వద్ద రూ.1.20 కోట్లతో నగరవనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతాన్ని టూరిస్టు ప్రాంతంగా అభివృద్ధి చేస్తామన్నారు. మారిటైం యూనివర్సిటీలో పోర్ట్ ట్రస్ట్ వారి సహకారంతో 2,200 మొక్కలు నాటుతున్నామన్నారు. అటవీ వనాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

నూకాంబిక ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం



చెక్కును అందిస్తున్న సుధీర్, హేమలత దంపతులు

అనకాపల్లి టౌన్: విశాఖ సీతమ్మధారకు చెందిన క్రిస్‌దా ఫ్యాషన్స్ అధినేత సిగటాపు సుధీర్, హేమలత దంపతులు గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ నిర్మాణం నిమిత్తం రూ.5 లక్షల విరాళం ఇచ్చారు. ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్‌లకు వారు బుధవారం చెక్కును అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్, ఈవోలు మాట్లాడుతూ ఇప్పటి వరకు విరాళంగా రూ.30 లక్షలు వచ్చినట్లు చెప్పారు.

‘ఉత్తమ పర్యాటక గ్రామం’ దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల: జిల్లాలో పర్యాటక రంగంలో ఉత్తమ పర్యాటక గ్రామాలు–2024 ఎంపికకు పర్యాటక మంత్రిత్వ శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా పర్యాటక అధికారి డాక్టర్ ఎ.మహేష్ ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, బాధ్యతాయుత, కళా ఖండాలు, కమ్యూనిటీ ఆధారిత, ఆరోగ్య రంగాలకు సంబంధించిన విశిష్టతలు కలిగిన గ్రామాలు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. www.rural.tourism.gov.in వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఉత్తమ పర్యాటక గ్రామం కేటగిరీలకు ఎంపికైన గ్రామాలకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పురస్కారాలు అందజేస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 80094 14743, 89857 54583 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఇళ్ల మరమ్మతులకు నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు అందిస్తున్న దేవస్థానం ఏఈవో నరసింహరాజు, సిబ్బంది

సింహాచలం: పంచ గ్రామాల్లో ఇళ్ల మరమ్మతులకు సంబంధించి గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఏఈవో నరసింహరాజు తెలిపారు. సింహాచలం కొండ దిగువ శ్రీదేవి కాంప్లెక్స్‌లో బుధవారం దరఖాస్తులు అందించే ప్రక్రియను ఆయన ప్రారంభించారు. దరఖాస్తుదారుడి పేరు, ఆధార్, మొబైల్ నంబర్లు నమోదు చేసుకుని, దరఖాస్తుపై క్రమ సంఖ్య వేసి అందజేశారు. తొలి రోజు 94 మంది నివాసితులు దరఖాస్తులు తీసుకున్నారని ఏఈవో తెలిపారు.

దరఖాస్తుతో సంబంధిత ధ్రువ పత్రాలు జత చేసి, ఆధార్ కార్డు తీసుకొని రావాలని సూచించారు. అలాగే www. simhachalam devasthanampermissionforrepairs. com వెబ్‌సైట్ నుంచి కూడా దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను సింహాచలంలోని శ్రీదేవి కాంప్లెక్స్‌లో ఉన్న కేంద్రంలోనే అందజేయాలని తెలిపారు.

3 పోలీస్ స్టేషన్లు అప్‌గ్రేడ్

- నక్కపల్లి, కశింకోట, రాంబిల్లి ఎంపిక
- త్వరలో సీఐల నియామకం



అప్‌గ్రేడ్ కానున్న నక్కపల్లి పోలీస్‌స్టేషన్

నక్కపల్లి: శాంతి భద్రతలు కాపాడటం, రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు జిల్లాలో మూడు పోలీస్‌స్టేషన్లను అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. డీజీపీ ప్రతిపాదనల మేరకు నక్కపల్లి, కశింకోట, రాంబిల్లి పోలీస్ స్టేషన్లను అప్‌గ్రేడ్‌చేసి సీఐ స్థాయి అధికారులను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని హోంశాఖ ముఖ్యకార్యదర్శి జీవో విడుదల చేశారు. జాతీయరహదారిపై ఉన్న మండల కేంద్రాలైన నక్కపల్లి, కశింకోట పోలీస్‌స్టేషన్లతో పాటు, లూప్‌లైన్లో ఉన్న రాంబిల్లి పోలీస్ స్టేషన్లో ప్రస్తుతం ఎస్ఐల పర్యవేక్షణలోనే శాంతిభద్రతలకు సంబంధించిన కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇకనుంచి ఈ స్టేషన్లు సీఐ స్థాయి అధికారి పర్యవేక్షణలో కొనసాగుతాయి. నక్కపల్లి స్టేషన్ పరిధిలో సుమారు 20 కిలోమీటర్లు, కశింకోట పరిధిలో 12 కిలోమీటర్ల జాతీయరహదారి ఉంది. జాతీయరహదారిపై తరచూ రోడ్డుప్రమాదాలు, వివిధ రకాల నేరాలు జరుగుతుంటాయి. హత్యలు, లైంగికదాడులు, దోపిడీలు,తీవ్రమైన నేరాల విషయంలో త్వరితగతిన సరైన నిర్ణయాలు తీసుకోవడంతో పాటు దర్యాప్తునకు సీఐ స్థాయి అధికారి అవసరం ఉంటుంది. ఇటువంటి క్రైం రేటు ఎక్కువగా ఉన్న స్టేషన్ల పరిధిలో ప్రజలకు శాంతి భద్రతలు కల్పించడం, సమస్యలు త్వరగా పరిష్కరించడం వంటి కార్యకలాపాలను మరింత సమర్థంగా నిర్వహించేందుకు వీలుగా ఈ స్టేషన్లకు సీఐలను నియమించాల్సిన అవసరం ఉందని పోలీస్ శాఖ గుర్తించింది. నక్కపల్లి మండలంలో నేరాల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. భవిష్యత్తులో పారిశ్రామికంగా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందనుంది. ఇండస్ట్రియల్ కారిడార్‌పేరుతో పలు కంపెనీలు తీర ప్రాంతం వెంబడి ఏర్పాటుకానున్నాయి. ఏపీఐఐసీ ద్వారా 5 వేల ఎకరాల భూసేకరణ జరిగింది. విశాలమైన తూర్పు తీరం వెంబడి దాదాపు ఎనిమిది మత్స్యకార గ్రామాలున్నాయి. నియోజకవర్గంలో అసెంబ్లీ, పార్లమెంట్ సాధారణ ఎన్నికల ప్రక్రియ తాలూకా కేంద్రమైన నక్కపల్లినుంచే నిర్వహిస్తారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని నక్కపల్లి స్టేషన్‌కు సీఐని నియమించాలని పోలీస్ శాఖ నిర్ణయించింది. ఇప్పటికే పాయకరావుపేటలో సీఐ, ఇద్దరు ఎస్ఐలు ఉన్నారు. తాజాగా నక్కపల్లిలో కూడా సీఐని నియమించేందుకు కసరత్తు జరుగుతోంది. రాంబిల్లి స్టేషన్ లూప్‌లైన్లో ఉంటుంది. కేంద్ర రక్షణమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సైనిక శిక్షణ శిబిరం, ఆయుధాల తయారీ కర్మాగారం ఏర్పాటు కానున్నాయి. ఇక్కడ కూడా సీఐ స్థాయి అధికారి అవసరముంది. రాష్ట్ర వ్యాప్తంగా 92 పోలీస్‌స్టేషన్లను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం తీసుకుంది. వీటిలో అనకాపల్లి జిల్లాలో ఈ మూడు స్టేషన్లు ఉన్నాయి. ఈ విషయాన్ని ఎస్ఐ విభీషణ్‌రావు వద్ద ప్రస్తావించగా త్వరలో ఈ స్టేషన్‌కు సీఐ స్థాయి అధికారి నియమితులు కాబోతున్నారన్నారు. ఇక నుంచి ప్రజలకు మరింత మెరుగైన రక్షణ సేవలు అందించే అవకాశం ఏర్పడుతుందన్నారు.

యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన డీఆర్వో దయానిధి

- డీఆర్‌వో దయానిధి

తుమ్మపాల : అర్హులైన యువతను ఓటర్లుగా చేర్పించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి సూచించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18, 19 సంవత్సరాల వయసు గల యువతీయువకులు ఓటర్లుగా నమోదయ్యేలా బీఎల్‌వోలు, బీఎల్ఏలు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని ఆయన కోరారు. ముఖ్యంగా పేదలు, నిరక్షరాస్యులు ఉన్న ప్రాంతాల్లో కొత్తగా ఓటు హక్కు వయసు వచ్చిన పిల్లలను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఫారం 6,7,8 ల ద్వారా 8,814 క్లెయింలు స్వీకరించినట్టు చెప్పారు. 21వ తేదీ వరకు క్లెయింల అభ్యంతరాలు 36,521 పెండింగ్ ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పి.రామకష్ణ (వైఎస్సార్‌సీపీ), బి.శ్రీనివాసరావు (టీడీపీ), పి. నాగేశ్వరరావు (బీజేపీ), కె.హరినాథబాబు (ఆమ్ ఆద్మీ), డి.సంతోష్ (కాంగ్రెస్), ఎస్.వి.వి. రామచంద్రరావు (బీఎస్పీ), పి.శంకరరావు (సీపీఎం), ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ లక్ష్మీదేవి, డీటీ రవి కుమార్, ఎస్ఏ తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ విజయాలు ప్రశంసనీయం

- నైపుణ్య కేంద్రంగా ప్రతి సాంకేతిక విద్యా సంస్థ
- మిజోరం గవర్నర్ హరిబాబు



ఏయూలోని ఆ-హబ్‌ని పరిశీలించి మాట్లాడుతున్న హరిబాబు

ఏయూ క్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇటీవల సాధించిన పలు విజయాలు తనకు అమితమైన సంతోషాన్ని కలిగిస్తున్నాయని ఏయూ పూర్వ విద్యార్థి, పూర్వ ఆచార్యుడు, మిజోరాం రాష్ట్ర గవర్నర్ కె.హరిబాబు అన్నారు. బుధవారం ఆయన ఏయూలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఏయూ ఒడిలో రాజకీయ ఓనమాలు నేర్చుకుని, జగదాంబ వీధుల్లో ఉద్యమ శ్వాసను పీల్చుకున్నానన్నారు. నాక్‌లో ఏయూ డబుల్ ప్లస్ సాధించడం పట్ల ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డిని అభినందించారు. నూతన విద్యా విధానం 2020ని ఏయూలో పూర్తిస్థాయిలో అమలుపై హర్షం వ్యక్తం చేశారు. యువత ఆలోచనలకు రూపం కల్పించే వేదికగా ఆ హబ్ నిలుస్తోందన్నారు. ప్రతి సాంకేతిక విద్యా సంస్థ ఒక నైపుణ్య శిక్షణ కేంద్రంగా నిలుస్తూ స్టార్టప్ వ్యవస్థను కలిగి ఉండాలని సూచించారు. ఆ హబ్‌ను సందర్శించి, వివరాలు తెలుసుకుని, యువతతో మాట్లాడారు. ఏయూ నుంచి యూనికార్న్‌లు ఆవిర్భవించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఏయూ వీసీ ప్రసాదరెడ్డి స్వయంగా హరిబాబుకు ఏయూ ఇంక్యుబేషన్ స్టార్టప్ కేంద్ర ఆ-హబ్ వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ పూర్వ సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాళ్లు ఆచార్య జి.శశిభూషణరావు, ఎస్.కె.భట్టి, టి.శోభశ్రీ, వి.విజయలక్ష్మి, ఆ హబ్ సీఈవో రవి ఈశ్వరపు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే సామాజిక సాధికారత

- 25న సబ్బవరంలో బస్సు యాత్ర
- ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్



బహిరంగ సభ ఏర్పాట్లపై డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రంగనాథంతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక సాధికారత సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. సబ్బవరంలో ఈ నెల 25న నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర ఏర్పాట్ల ను బుధవారం ఉత్తరాంధ్ర సాధికార బస్సుయాత్ర పరిశీలకుడు లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌తో కలిసి ఆయన పరిశీ లించారు. చోడవరం–సబ్బవరం రోడ్డులో దుర్గాలమ్మ ఆలయం సమీపంలో బహిరంగ సభ నిర్వహణకు అనుకూలంగా ఉంటుందని గుర్తించారు. పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు, తదితర అంశాలపై పోలీసులతో చర్చించారు.

ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్ద ఎత్తున మేలు చేకూర్చారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షు డు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో మాడుగుల, అనకాపల్లి, యలమంచిలలో నిర్వహించిన సాధికార యాత్రలు విజయవంతమయ్యాయన్నారు. ఈ నెల 25న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో బస్సుయాత్ర, బైక్ ర్యాలీ వేపగుంట లో ప్రారంభమవుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ.2 లక్షల కోట్లకు పైగా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సాయంత్రం డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రంగనాథంతో కలిసి బహిరంగ సభతో పాటు ట్రాఫిక్, పార్కింగ్ ఏర్పాట్లను అదీప్‌రాజ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కోటపాడు జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లి అనురాధ, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి, కాపుశెట్టి శేషుబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ సందడి



ఆసీస్ కెప్టెన్ మాథ్యూ వేడ్



భారత్ కెప్టెన్ సూర్యకుమార్



టీ20 మ్యాచ్‌కు సిద్ధమైన స్టేడియం

- నేడు భారత్–ఆస్ట్రేలియా టీ–20 మ్యాచ్
- సిద్ధమైన వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియం
- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం



సూర్యకుమార్‌కు కోచ్ వీవీఎస్ లక్ష్మణ్ సూచనలు

విశాఖ స్పోర్ట్స్: విశాఖలో క్రికెట్ సందడి నెలకొంది. వైఎస్సార్ ఏసీఏ– వీడీసీఏ స్టేడియం వేదికగా గురువారం రాత్రి 7 గంటలకు భారత్, ఆస్ట్రేలియా మొదటి టీ–20 మ్యాచ్ ప్రారంభం కానుంది. మ్యాచ్ కోసం ఇప్పటికే విశాఖ చేరుకున్న ఇరు జట్లు స్టేడియంలో ముమ్మరంగా ప్రాక్టీస్ చేశాయి. ఈ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లు ఇప్పటికే హాట్‌కేకుల్లా అమ్ముడయ్యాయి. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా టికెట్ విక్రయించారు. ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్ ఓటమి తర్వాత క్రికెట్ అభిమానులు చాలా డీలా పడ్డారు. ఆ ఓటమిని ఇంకా జీర్ణించుకోలేకపోతున్నారు. కీలక పోరు ముగిసిన తర్వాత జరుగుతున్న టీ–20 మ్యాచ్ కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. భారత జట్టు ప్రధాన ఆటగాళ్లకు విశ్రాంతినివ్వడంతో.. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో యువ క్రికెటర్లకు ఈ సిరీస్ గొప్ప సువర్ణావకాశం. ఐపీఎల్, ఇటీవల ఐర్లాండ్ టూర్‌లో విజృంభించిన కుర్రాళ్లు.. విశాఖ వేదికగా సత్తా చాటి జాతీయ జట్టులో బెర్త్ పదిలం చేసుకోవచ్చు. జోరు మీదున్న ఆస్ట్రేలియా జట్టును ఢీకొట్టి శుభారంభం అందించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

వరల్డ్ కప్ క్రికెట్ టైటిల్ సాధించి ఊపు మీదున్న ఆస్ట్రేలియా నాలుగు రోజుల వ్యవధిలోనే విశాఖ వేదికగా టీ20 సిరీస్‌కి సిద్ధమైంది. భారత్ తరఫున ప్రధాన ఆటగాళ్లంతా విశ్రాంతి తీసుకుంటుండగా.. ఆస్ట్రేలియా తరఫున కొందరు ఆటగాళ్లు తమ ఇళ్లకు చేరారు. ఫైనల్‌లో సత్తాచాటిన ఆస్ట్రేలియా ఆటగాళ్లు ఇప్పటికే విశాఖకు చేరుకుని నెట్స్‌లో శ్రమించారు.

అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో పాటు అంతర్జాతీయ ఆరంగేట్రం చేసే కుర్రాళ్లు ఆస్ట్రేలియా తరఫున బరిలోకి దిగనుండగా.. ఆసియా కప్, ఐర్లాండ్ టీ–20 సిరీస్ మినహా పూర్తిస్థాయిలో మేజర్ టోర్నీలు ఆడిన అనుభవం లేని యువ భారత్ జట్టు వారితో ఢీ కొట్టనుంది.

భారత్‌కు నాయకత్వం వహిస్తున్న సూర్యకుమార్‌కు, కోచ్‌గా వి.వి.ఎస్ లక్ష్మణ్‌కు ఇదే తొలి మ్యాచ్. ఈ మ్యాచ్‌లో భారత్ కుర్రాళ్లు శుభారంభం చేసి ఆధిక్యాన్ని ప్రదర్శించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

గత చరిత్ర చూస్తే..

ఆస్ట్రేలియా, భారత్ జట్లు వైఎస్సార్ స్టేడియంలో నాలుగేళ్ల కిందట సిరీస్ తొలి టీ–20లోనే తలపడ్డాయి. ఇరు జట్లు పూర్తి స్థాయి ఆటగాళ్లతో బరిలోకి దిగగా.. టాస్ గెలిచిన ఆస్ట్రేలియా ఫీల్డింగ్ ఎంచుకుంది. స్వతహాగా బ్యాటింగ్‌కు అనుకూలించే విశాఖ పిచ్‌పై భారత్ ఏడు వికెట్లు కోల్పోయి 126 పరుగులు చేసింది.

మూడో ఓవర్ ముగిసేప్పటికి భారత్ కేవలం ఒకే వికెట్ కోల్పోయి 15 పరుగులు చేసిన స్థితి నుంచి చివరి ఓవర్ వరకు ఆస్ట్రేలియాకు ఆధిక్యాన్ని ఇవ్వకుండా కాపాడుకుంటూనే కొనసాగింది. ఆస్ట్రేలియా మూడు ఓవర్లలో రెండు కీలక వికెట్లు కోల్పోయి 9 పరుగులే చేసింది. ఇరు జట్లు చివరి ఓవర్ వరకు ఏడే వికెట్లు కోల్పోయినా భారత్ (118 పరుగులు) ఆస్ట్రేలియా (113 పరుగులే)పై ఆధిక్యాన్ని కొనసాగించింది.

అనూహ్యంగా 20వ ఓవర్‌లో ఆస్ట్రేలియా 14 పరుగులు చేసి చివరి బంతికి విజయాన్ని సొంతం చేసుకుంది. భారత జట్టులోని కొంత మంది అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడినా.. అందరికి దేశవాళీ క్రికెట్‌లో సత్తాచాటిన అనుభవమే ఉంది. విశాఖ వేదికగా ఆడే సిరీస్ తొలి మ్యాచ్‌లో ఏ మేరకు రాణించి ఆస్ట్రేలియాపై ఒత్తిడి తెస్తారనేదే క్రీడాభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది.

బతుకు నావకు భరోసా

ప్రమాదం జరిగిన 72 గంటల్లోనే పరిహారం

- రికార్డు సమయంలో ఆదుకున్న సీఎం వైఎస్ జగన్
- ఒక్కో బోటు యజమానికి 80 శాతం పరిహారం
- రూ.7.11 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- బోటుపై ఆధారపడిన వారికీ ఆపన్న హస్తం
- వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ఒక్కొక్కరికీ రూ.10 వేల సాయం
- 480 మందికి అందజేసేలా ఏర్పాట్లు
- నేడు మంత్రి సీదిరి చేతుల మీదుగా పరిహారం అందజేత



ఘటనా స్థలం నుంచి ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

సాక్షి, విశాఖపట్నం: హుద్‌హుద్ విపత్తులో నష్టాల వలలో చిక్కుకున్న మత్స్యకారులకు పరిహారం అందించేందుకు టీడీపీ ప్రభుత్వానికి ఐదేళ్లు పట్టింది. వందలసార్లు వినతులిచ్చి.. ప్రభుత్వం చుట్టూ కాళ్లరిగేలా తిరిగితే కానీ ఆదుకునేందుకు వారికి మనసు రాలేదు. కానీ ప్రమాదంలో రోడ్డున పడ్డ మత్స్యకార కుటుంబాలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేవలం 72 గంటల సమయం తీసుకున్నారు. ఘటన జరిగిన వెంటనే దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం.. నష్టంలో 80 శాతం పరిహారం అందజేస్తామని వెంటనే ప్రకటించారు. చెప్పారంటే చేస్తారన్నది మరోసారి నిరూపించుకుంటూ.. బాధిత మత్స్యకారులకు గురువారం రూ.7.11 కోట్ల పరిహారం అందజేయనున్నారు. ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం రాత్రి జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో బోట్లు అగ్నికి ఆహుతై.. సర్వం కోల్పోయి మత్స్యకారులు రోడ్డున పడ్డారు. ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించింది. ఎక్కడా లేని విధంగా ప్రమాదం జరిగిన వెంటనే పరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. 72 గంటలు గడవకముందే పంపిణీ చేయాల్సిన సొమ్మును కలెక్టర్ ఖాతాకు జమ చేశారు. ఈ ప్రమాదంలో మొత్తం 30 బోట్లు పూర్తిగా దగ్ధమవ్వగా..18 బోట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వీటితో పాటు ఒక మత్స్యకారుడి వల కూడా ప్రమాదంలో పాక్షికంగా కాలిపోయింది. విచారణ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం బాధిత మత్స్యకారుల జాబితాను సేకరించిన కలెక్టర్ డా.మల్లికార్జున నేతృత్వంలో జిల్లా యంత్రాంగం నివేదికను ప్రభుత్వానికి పంపించింది. నివేదిక పంపించిన గంటల వ్యవధిలోనే ప్రభుత్వం నుంచి పరిహారం సొమ్ము జిల్లాకు చేరుకుంది. నష్టంలో 80 శాతం అంటే.. మొత్తం రూ.7,11,76,000 అందించనున్నారు. ఈ మేరకు పూర్తిగా దెబ్బతిన్న 30 బోట్లకు రూ.7,21,50,000, అందులో ఉన్న వలలకు రూ.84.50 లక్షలు చొప్పున మొత్తం రూ. 8,06,00,000 నష్టపోయినట్లు అంచనా వేశారు. ఇందులో 80 శాతం అంటే రూ.6,44,80,000ని 30 మంది బోటు యజమానులకు అందించనున్నారు. అదే విధంగా పాక్షికంగా దెబ్బతిన్న 18 బోట్లు, ఒక వలకు రూ.71.50 లక్షలు, బోట్లలో ఉన్న వలలకు రూ.12.20 లక్షలు చొప్పున మొత్తం రూ.83.70 లక్షలు నష్టం వాటిల్లినట్లు గణించారు. ఇందులో 80 శాతం రూ.66.96 లక్షలు అందించనున్నారు.

బోటుపై ఆధారపడిన వారికీ..

కేవలం బోటు యజమానులే కాకుండా.. ఆ బోటుపై ఆధారపడే వారి గురించీ ప్రభుత్వం ఆలోచన చేసింది. సముద్రంలోకి వేటకు వెళ్లేనే ఆ పూట గడిచే పరిస్థితి ఉన్న హమాలీలు, చిరు వ్యాపారులు ఈ ప్రమాదం వల్ల ఉపాధి కోల్పోయారు. సాధారణంగా ఏ ప్రభుత్వమూ వీరి గురించి పట్టించుకునే పరిస్థితి ఉండదు. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. బోటుపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల్ని ఆదుకునేందుకు ముందుకొచ్చారు. ఒక్కో బోటుపై సుమారు 10 మంది చొప్పున ఆధారపడి జీవనం సాగిస్తుంటారనీ.. ఈ లెక్కన మొత్తం 48 బోట్లపై 480 మంది హమాలీలు, చిరు వ్యాపారులు ఆధారపడుతున్నారని అధికారులు నివేదిక సిద్ధం చేశారు. ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద పంపిణీ చేయనున్నారు. ఇలా ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం పరిహారం అందించడం ఇదే ప్రప్రథమమని మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విచారణ వేగవంతం

అగ్ని ప్రమాద ఘటనపై దర్యాప్తు బృందం విచారణ వేగవంతం చేసింది. ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకొని విచారించిన పోలీసులు.. బుధవారం కూడా మరికొంత మందిని విచారించారు. మొత్తం 30 మందిని విచారించిన పోలీసులు కీలక సమాచారాన్ని రాబట్టుకున్నారు. అదేవిధంగా ప్రమాదం జరిగిన సమయంలో హార్బర్‌లో మందు సేవిస్తున్న వారి వివరాలను కూడా సేకరించారు. ప్రమాదం జరగడానికి 15 నిమిషాల ముందు, ప్రమాదం జరిగిన తర్వాత 10 నిమిషాల సమయంలో ఫిషింగ్ హార్బర్ ప్రాంతంలో ఫోన్ నంబర్ల లొకేషన్ల ఆధారంగా ఎవరెవరున్నారనే వివరాలు సేకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. బుధవారం ఉదయం క్లూస్ టీమ్ ఘటనా స్థలికి చేరుకుని ఆధారాలు సేకరించింది. మరోవైపు అగ్నిమాపక శాఖ అధికారులు కూడా వివరాలు సేకరిస్తున్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి

నర్సీపట్నం: జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన వేములపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను ఎంపీపీ సుర్ల రాజేశ్వరి బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వేములపూడి జెడ్పీ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి నర్సీపట్నం మండలానికి పేరు తీసుకువచ్చారని చెప్పారు. జాతీయస్థాయిలో కూడా ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

25న అనకాపల్లిలో పురందేశ్వరి పర్యటన

అచ్యుతాపురం (అనకాపల్లి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఈ నెల 25న అనకాపల్లి విచ్చేయనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈర్లె శ్రీరామమూర్తి తెలిపారు. అచ్యుతాపురం బీజేపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన బీజేపీ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. పురందేశ్వరికి ఘన స్వాగతం పలికేందుకు బీజేపీ శ్రేణులు తరలిరావాలన్నారు. ఆ రోజు ఉదయం బీజేపీ సంస్థాగత బూత్ కమిటీ సభ్యులతో, మధ్యాహ్నం మండల అధ్యక్షులు, నియోజక వర్గ కన్వీనర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులతో ఆమె సమావేశమవుతారని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా దూసుకొచ్చి.. లారీని ఢీకొట్టి..

- పిల్లలను ప్రమాదంలోకి నెట్టేసిన ఆటోడ్రైవర్ అతివేగం
- నలుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలు
- బాధితులకు వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్ పరామర్శ



(సీసీ ఫుటేజ్‌లో రికార్డ్ అయిన ఫొటో) లారీ సమీపంలోకి దూసుకొచ్చిన ఆటో



ప్రమాద స్థలిలో చెల్లాచెదురుగా రోడ్డుపై విద్యార్థులు



గాయపడ్డ ఆటో డ్రైవర్



తలపై తీవ్రగాయంతో హాసిని ప్రియ



ఆస్పత్రిలో హాసినిప్రియను పరామర్శిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్

సీతమ్మధార : అంకుల్.. లారీ వస్తోంది చూడండి.. అని ఓ అమ్మాయి చెప్పినప్పటికీ.. ఆ భారీ వాహనాన్ని తప్పించుకుని ముందుకు వెళ్లిపోవాలని అతి వేగంతో దూసుకొచ్చిన ఆటోడ్రైవర్ 8 మంది విద్యార్థుల భవిష్యత్‌ను ప్రమాదంలోకి నెట్టేశాడు. వీరిలో నలుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలవడంతో ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కంచరపాలెం, మురళీనగర్, 104 ఏరియా ప్రాంతాలకు చెందిన హాసిని ప్రియ (15), వాణి జయ రమ్య (13), డి.లక్ష్య (8), జి.గాయత్రి (13), మరో నలుగురు విద్యార్థులు నగరంలోని బేతనీ స్కూల్‌లో చదువుతున్నారు. వీరు అదే ప్రాంతానికి చెందిన రాజు అనే వ్యక్తి ఆటోలో మూడేళ్లుగా స్కూల్‌కు వస్తున్నారు. ఎప్పటిలాగే బుధవారం ఉదయం ఆటోలో స్కూల్‌కు బయలుదేరారు. అయితే అప్పటికే ఆలస్యం కావడం... వీరిని పాఠశాల వద్ద దించేసి, మరికొంత మంది విద్యార్థులను వేరే స్కూల్‌కు తీసుకెళ్లాల్సి ఉండడంతో డ్రైవర్ రాజు ఆటోను వేగంగా నడుపుతున్నాడు.

ఈ క్రమంలో వీరి ఆటో సంగం శరత్ థియేటర్ జంక్షన్ సమీపానికి వచ్చేసరికి, రైల్వే స్టేషన్ రోడ్డులో కాంప్లెక్స్ వైపు ఓ లారీ వస్తోంది. ఫ్లైఓవర్ సమీపానికి వచ్చేసరికి లారీ కనిపించడంతో ఆటోలోని హాసిని ప్రియ గమనించి... లారీ వస్తోందని గట్టిగా అరిచింది. అయినప్పటికీ ఆ లారీని దాటి ముందుకు వెళ్లిపోవాలని నిర్లక్ష్యంతో డ్రైవర్ రాజు ముందుకు దూసుకురాగా... అప్పటికే లారీ వచ్చేయడంతో దాన్ని ఢీకొట్టి ఆటో బోల్తాపడింది. ఒక్కసారిగా అందులోని విద్యార్థులంతా చెల్లాచెదురుగా రోడ్డుపై పడిపోవడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన నలుగురికి, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆటో నుజ్జునుజ్జయ్యింది. అదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న ఓ ప్రైవేట్ హోటల్ మేనేజర్ వెంకటరావు స్పందించి స్థానిక యువకుడు శివ సహకారంతో తీవ్ర గాయాలైన హాసిని ప్రియ, వాణి జయ రమ్య, డి.లక్ష్య, జి.గాయత్రిని తన కారులో తీసుకెళ్లి సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం వీరంతా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో హాసిని ప్రియ తలకు తీవ్ర గాయమవడంతో వైద్యులు శస్త్రచికిత్స చేసి పర్యవేక్షణలో వుంచారు. మిగిలిన విద్యార్థులను రైల్వే ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వారిని డిశ్చార్జి చేశారు. ఆటో డ్రైవర్ రాజును కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాద స్థలాన్ని ద్వారకా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐలు ధర్మేంద్ర, అప్పలరాజు పరిశీలించి ఆటో, లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డీసీపీ - శ్రీనివాసరావు సెవెన్ హిల్స్ ఆస్పత్రికి వెళ్లి విద్యార్థుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

బాధిత విద్యార్థులకు పరామర్శ

లారీని ఆటో ఢీకొట్టిన ప్రమాదంలో గాయాలపాలైన విద్యార్థులను సెవెన్ హిల్స్ ఆస్పత్రికి వెళ్లి వైఎస్సార్ సీపీ రీజినల్ కో - ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పరామర్శించారు. పిల్లల తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. వైద్య ఖర్చులు ప్రభుత్వం భరిస్తుందని, అవసరమైన సేవలు అందించాలని వైద్యులను కోరారు. ఆయనతోపాటు ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, గొండు సీతారామ్, సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ ఎం.ఆనందకుమార్, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, డీఈవో చంద్రకళ, రోడ్డు రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ రాజారత్నం తదితరులు పరామర్శించారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై ఫోకస్

- రేపు జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం
- స్కూల్ బస్సులు, ఆటోలపై స్పెషల్ డ్రైవ్
- నేటి నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు

విశాఖ విద్య: విద్యార్థుల భద్రతపై జిల్లా యంత్రాగం ఫోకస్ పెట్టింది. నగరంలో బుధవారం రెండు చోట్ల జరిగిన ప్రమాదాలతో అప్రమత్తమైన అధికారులు, మరోమారు ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్టమైన కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 24న జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించనున్నారు. విద్య, రవాణా, పోలీసు, జీవీఎంసీ అధికారులు సమావేశానికి హాజరుకావాలని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆదేశించారు. జిల్లాలోని ప్రైవేటు స్కూళ్ల అసోసియేషన్ల వారిని కూడా సమావేశంలో భాగస్వాములను చేస్తున్నారు. ప్రైవేటు స్కూళ్లకు విద్యార్థులను తీసుకెళ్లే ఆటోల్లో సరైన నిబంధనలు పాటించని కారణంగానే ప్రమాదాలు చోటుచేసుకున్నాయని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

సమగ్ర వివరాల సేకరణ

ప్రైవేటు స్కూళ్లకు విద్యార్థులను బస్సుల ద్వారా తీసుకెళ్లేందుకు మాత్రమే రవాణా శాఖ అధికారులు అనుమతులు ఇస్తున్నారు. కానీ ఆటోల ద్వారా కూడా ఎక్కువగా విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నందున వీటిపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. భవిష్యత్‌లో ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టేందుకు నిర్ణయించారు. జిల్లాలోని ప్రైవేటు స్కూళ్లకు ఎంతమంది వాహనాల ద్వారా వస్తున్నారు..? బస్సుల ద్వారా వచ్చే వారు ఎంత మంది..?, ఆటోల ద్వారా ఎంతమంది వస్తున్నారనే పక్కా లెక్క సేకరించాలని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆదేశించారు. విద్యార్థులను స్కూళ్లకు తీసుకొచ్చే బస్సు లేదా ఆటోలకు సంబంధించిన సమగ్ర వివరాలు, వాటిని నడిపే వారి వివరాలు స్కూళ్ల యాజమాన్యాల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టనున్నారు.

నేటి నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు

విద్యార్థుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ మల్లికార్జున స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో రవాణాశాఖ అప్రమత్తమైంది. విద్యార్థులను స్కూళ్లకు తీసుకెళ్లే వాహనాలను గురువారం నుంచి తనిఖీ చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో మూడు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు మూడు రోజులపాటు జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నాయి. గాజువాకలో ఒకటి, మరో రెండు టీమ్‌లు గురువారం నుంచి నగరంలో ఉదయం, సాయంత్రం వేళల్లో తనిఖీలు చేయనున్నాయి.

ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి



విలేకర్లతో మాట్లాడుతున్న ఏఎస్పీ రాణా

నాతవరం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించినట్లు నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను బుధవారం రాత్రి ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్‌ఐ రామారావును అడిగి మండలంలోని ప్రధాన సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నర్సీపట్నం డివిజన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ముమ్మరంగా తనిఖీలు నిర్వహించాలని ఎస్‌ఐలను ఆదేశించారు. సారా తయారీదార్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య ఉన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



కాసులు రాజు(ఫైల్)

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం వద్ద బుధవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రాంబిల్లికి చెందిన దంతులూరి వెంకట రమణమూర్తి రాజు(70) అలియాస్ కాసులు రాజు అక్కడికక్కడే మృతి చెందారు. అనకాపల్లిలో స్కూటీ రిపేరు చేయించుకుని రాంబిల్లికి వెళుతుండగా లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఘటనా స్థలం వద్ద మృతుని తల నుజ్జునుజ్జయింది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. టాటా స్టీల్ సంస్థలో పనిచేసి, పదవీ విరమణ అనంతరం స్వగ్రామంలో స్థిరపడ్డారు. పిల్లలిద్దరూ హైదరాబాద్‌లో ఉంటున్నారు.

రాంబిల్లిలో విషాద ఛాయలు

రాంబిల్లి: హరిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కాసులురాజు మృతితో అతని కుటుంబంతో పాటు స్వగ్రామం రాంబిల్లిలో విషాద ఛాయలు అలముకున్నాయి. నలభై, యాభయ్యేళ్లకే ఆరోగ్య సమస్యలతో సతమతమవుతూ ఇబ్బందులు పడుతున్న రోజుల్లో కాసులు రాజు ఉత్సాహంగా వ్యవసాయ పనులు చేసుకునేవారని గ్రామస్తులు చెప్తున్నారు. తనకున్న భూమిలో వ్యవసాయ పనులు చేసుకుంటూ, మంచి వ్యక్తిగా పేరుంది. అందరితో కలివిడిగా ఉంటూ కష్టసుఖాలు పంచుకునే కాసులురాజు ఇక లేరనే వార్తతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన



సెయింట్ జాన్స్ స్కూల్ వద్ద నిరసనలో పాల్గొన్న ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

కశింకోట: జిల్లా సర్వశిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ధర్నా నిర్వహించారు. ఎస్ఎస్ఏ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు హేబిటేషన్ డెవలప్‌మెంట్ ప్లాన్‌పై స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్లో జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించగా.. దానికి హాజరై తరగతులను బహిష్కరించారు. అనంతరం స్కూల్ ముందు బైఠాయించి, మోకాళ్ల నిల్చుని నిరసన తెలిపారు. ఏపీ ఎస్ఎస్ఏ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.సంతోష్, కార్యదర్శి నాగేశ్వరరావు, కన్వీనర్ వి.వెంకటరావు నాయకత్వం వహించారు. తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని, వేతనం పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలు చేశారు.

కారు దూసుకుపోయి మహిళా ఉద్యోగికి గాయం

ఉద్యోగులు నిరసన తెలుపుతుండగా విద్యా శాఖ జిల్లా అదనపు డైరెక్టర్(ఏడీ) రవిబాబు కారును నిరసనకారులు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఆగకుండా కారును డ్రైవర్ నిర్లక్ష్యంగా ముందుకు పోనిచ్చాడు. నక్కపల్లికి చెందిన ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ డి.ఝాన్సీ కాలు మీదుగా వెళ్లడంతో నరాలు దెబ్బతిని గాయమైంది. నిరసనకారులు కారును అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఏడీ రవిబాబు క్షమాపణ చెప్పడంతో ఉద్యోగులు శాంతించారు. ఝాన్సీని అనకాపల్లిలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ఆందోళనలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, సీఆర్ఎంటీ ఉద్యోగులు పాల్గొన్నారు. ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన లింగాచారి, శ్రీను

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లి శ్మశాన వాటిక వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. టౌన్ ఎస్‌ఐ సుధాకరరావు అందించిన వివరాలు.. మాకవరపాలెం మండలం, సీతన్నఅగ్రహారం గ్రామానికి చెందిన పి.శ్రీను(30) బైక్‌పై నర్సీపట్నం వచ్చి, తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. నాతవరం మండలం, వెదురుపల్లి గ్రామానికి చెందిన సీహెచ్ లింగాచారి, తన సోదరుడు చినబాబుతో బైక్‌పై అనకాపల్లి వెళ్లి, తిరిగి వస్తున్నారు. పెదబొడ్డేపల్లి శ్మశాన వాటిక వద్దకు వచ్చేసరికి రెండు బైక్‌లు బలంగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో శ్రీను, లింగాచారి తీవ్రంగా గాయపడ్డారు. చినబాబుకు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. శ్రీను పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. లింగాచారి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ ఢీకొని గాయపడ్డ వ్యక్తి మృతి

రాంబిల్లి: బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వెంకటాపురం గ్రామానికి చెందిన ఎస్.జోగినాయుడు(53) మృతి చెందినట్లు ఎస్‌ఐ దీనబంధు తెలిపారు. ఈ నెల 21న కూలి పనికి వెళ్లి, తిరిగి ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా బైక్ ఢీకొట్టడంతో జోగినాయుడు తీవ్రంగా గాయపడ్డారు. తొలుత అతడిని అనకాపల్లి ఆస్పత్రికి, అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి సమయంలో మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుని కుమారుడు ఉపేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రాయితీపై సమీకృత దాణా



టీఎంఆర్ దాణాను రైతుకు అందిస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్, ఏడీ బైరాగి

కె.కోటపాడు : రాయితీపై పాడి రైతులకు అందిస్తున్న టీఎంఆర్ దాణాను సద్వినియోగం చేసుకుని మంచి లాభాలను పొందాలని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు. కె.కోటపాడులో బుధవారం రాయితీపై రైతులకు సమీకృతదాణా(టీఎంఆర్)ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.బైరాగి మాట్లాడుతూ కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల పరిధిలో 60 మంది రైతులకు 25 టన్నుల టీఎంఆర్ పశుదాణా అందజేయనున్నట్లు చెప్పారు. పశువైద్య సహాయకులు కాళ్ల గోపి, సమీరా పాల్గొన్నారు.

నేటి నుంచి 'వికసిత్ భారత సంకల్పయాత్ర' ప్రచారం

మాడుగుల రూరల్: వికసిత్ భారత సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి అవగాహన కార్యక్రమాన్ని గురువారం నుంచి పంచాయతీలు వారీగా నిర్వహించనున్నట్లు స్థానిక ఎంపీడీవో మీనాకుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నెల 7 వ తేది వరకు ప్రచారం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

తారువలో 'వై ఏపీ నీడ్స్ జగన్' నేడు

దేవరాపల్లి: మండలంలోని తారువలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పాల్గొంటారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బాబూరావు కోరారు.

శతశాతం అర్జీదారుల సంతృప్తే లక్ష్యం

- జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి
- జగనన్నకు చెబుదాంకు విశేష స్పందన



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి



తల్లికి వితంతు పింఛన్ కోసం అర్జీ ఇచ్చేందుకు సహాయకునితో వచ్చిన దివ్యాంగుడు వెంకటరమణ

యలమంచిలి(అనకాపల్లి రూరల్): ప్రజల సమస్యల్ని సత్వరమే పరిష్కరించడానికి, శతశాతం సంతృప్తి చెందేలా వినతులను పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అన్నారు. బుధవారం యలమంచిలి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరైన ఆమె మండలానికి చెందిన పలువురి నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులంతా నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.

రెవెన్యూ సమస్యలే అధికం

అర్జీల పూర్తి స్థాయి పరిష్కారమే లక్ష్యంగా యలమంచిలిలో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి మండల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడానికి 15 కౌంటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 91 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించివే 56 ఉన్నాయి.

- లక్కవరం గ్రామానికి చెందిన యన్నంరెడ్డి వెంకట రమణ(19) పోలియో, అంధత్వంతో బాధపడుతున్నాడు. నడవలేని స్థితిలో ఉన్న అతడిని తల్లి లక్ష్మి, బంధువులు కార్యక్రమానికి తీసుకొచ్చారు. అతని తండ్రి 8 నెలల క్రితం మరణించడంతో తల్లి లక్ష్మికి వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఎన్నిసార్లు ప్రయత్నించినా సత్యనారాయణకు బయోమెట్రిక్, ఐరిష్ ద్వారా వేలిముద్రలుగాని, కనుబొమ్మలు గానీ గుర్తించడంలేదు. దీంతో కుటుంబ రేషన్ కార్డులో తండ్రి పేరు తొలగించడానికి వీలుపడటంలేదు. ఈ సమస్యను పరిష్కరించి తన తల్లికి వితంతు పింఛను ఇప్పించాలని అర్జీ ఇచ్చారు. వినతిని పరిశీలించిన జేసీ జాహ్నవి సంబంధిత అధికారులను పిలిచి వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు.
- లైనుకొత్తూరు పంచాయతీ సోమన్నపాలెం గ్రామంలో నీళ్ల ట్యాంకు స్థలాన్ని ఆక్రమించుకుని ఇంటి నిర్మాణం చేపట్టారని, వీఆర్వోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామానికి చెందిన మాజీ సైనికోద్యోగి లాలం సోమునాయుడు ఫిర్యాదు చేశారు.
- ఇదే గ్రామానికి చెందిన గెడ్డ, ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని మరో ఫిర్యాదు కూడా ఇచ్చినట్టు సోమునాయుడు తెలిపారు.
- యలమంచిలి పట్టణానికి చెందిన పెదపాటి లీలావతి, పాలవలస సాయి లక్ష్మి, పాలవలస అయ్యప్పలు ఇంటి స్థలం కావాలని అర్జీ ఇచ్చారు.
- పెదపల్లిలో సర్వే నెం.286లో 3.73 ఎకరాల ప్రభుత్వ భూమికి దస్తావేజులు సృష్టించి పలువురికి విక్రయించారని, వెంటనే చర్యలు తీసుకోవాలని బొద్దపు శ్రీనివాసరావు, పి.నవీన్ ఫిర్యాదు చేశారు.
- సీపీఎం నాయకుడు రొంగలి రాము పట్టణంలోని కొక్కిరాపల్లి రైల్వేగేటు వద్ద 14 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రైల్వే ఫ్లైఓవర్ పనులు పూర్తి చేయించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్, అనకాపల్లి ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారిణి మంజులవాణి, డ్వామా పీడీ ఇ.సందీప్, డీఈవో వెంకటలక్ష్మమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అజయ్‌బాబు, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మోడల్ పార్కుగా శాంతి పార్కు



జీవీఎంసీ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: స్థానిక శారదానది ఒడ్డున గల శాంతి పార్కును సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేస్తున్నట్లు ఎంపీ బీవీ సత్యవతి తెలిపారు. పార్కు ఆవరణను బుధవారం ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఈ పార్కును మోడల్ పార్కుగా ఆధునికీకరించాలని కోరగా జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్‌వర్మ రూ.49.83 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. టెండర్లు ఖరారు చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఎంపీ ఎల్‌ఏడీఎస్ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ భర్త కాంగ్రేగుల విష్ణుమూర్తి, జీవీఎంసీ అధికారులు, సిబ్బంది, పార్టీ నాయకుడు గైపూరి రాజు పాల్గొన్నారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం సాగి సుబ్బరాజుగారివీధి, మండలంలోని తుమ్మపాల గ్రామంలలో గురువారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబులు బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

కుల గణనపై సచివాలయ సిబ్బందికి శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న గణేష్

అనకాపల్లిటౌన్: కుల గణనపై వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని 6వ సచివాలయ అడ్మిన్ గణేష్ కోరారు. సచివాలయంలో బుధవారం వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి ఆయన శిక్షణ ఇచ్చారు. ప్రతి రోజూ ఇంటింటికీ వెళ్లి 8 ఏళ్ల కంటే తక్కువ వయస్సుగల పిల్లలను మినహాయించి, కుటుంబ సభ్యులందరికీ అవగాహన కల్పించాలన్నారు. కుటుంబ సభ్యుడు మృతి చెందినట్లు గుర్తిస్తే, కుటుంబంలో ఒకరిచే ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలన్నారు. సమావేశంలో సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమేష్

అనకాపల్లిటౌన్: మోటారు వాహన చట్టం ప్రకారం నిబంధనలు పాటించని ఆటోలపై చర్యలు తీసుకున్నట్లు ఎస్.రాయవరం ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా బుధవారం నిబంధనలు పాటించని 11 ఆటోలపై రూ.22 వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

స్థానిక రింగ్‌రోడ్డులో ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నియంత్రణ చర్యలపై స్థానిక ఎస్‌ఐ జె.రమేష్ అవగాహన కల్పించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకునేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

నేడు సత్యసాయి జయంతి వేడుకలు



శ్రీ సత్యసాయిబాబా భజన మండలి భవనం

అనకాపల్లిటౌన్: స్థానిక గాంధీనగరం పాత కోర్టువీధి శ్రీసత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో సత్యసాయి 98వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండలి సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి జరుగుతున్న జయంత్యుత్సవాలు గురువారం జరిగే వేడుకలతో ముగియనున్నాయన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు, సేవలు, ప్రసాద వితరణ చేయనున్నట్లు వెల్లడించారు.

సచివాలయం.. మన ఊరి సేవాలయం

గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాకారం

ఉన్న ఊర్లో ఇంటి ముంగిటే ప్రభుత్వ సేవలు



నా పేరు దాడి రామలక్ష్మి. మాది పిసినికాడ. నా భర్త మూడేళ్ల క్రితం చనిపోయారు. కొద్ది రోజులు అచ్యుతాపురం బ్రాండిక్స్‌లో పనిచేశాను. అనారోగ్యం వల్ల పనిమానేశాను. వలంటీరు ద్వారా సచివాలయంలో వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేశాను. వెంటనే పరిశీలించి, నెలరోజుల తర్వాత నుంచి పింఛను ఇస్తున్నారు. నా కుమార్తె త్రిషాలి లక్ష్మి 8వ తరగతి చదువుతోంది. నాలుగేళ్లుగా అమ్మ ఒడి వస్తోంది. మా అత్త కాంతమ్మ వృద్ధాప్య పింఛన్ అందుకుంటోంది. ఇవన్నీ సచివాలయం, వలంటీర్ల వల్లే జరుగుతున్నాయి.



అనకాపల్లి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన కొంకిపూడి క్రాంతికి ఇద్దరు పిల్లలు. వారిలో ఒకరికి అమ్మఒడి ద్వారా ఏడాదికి రూ.15 వేలు అందుతోంది. భర్త వాహన మిత్ర లబ్ధిదారుడు. ఏటా రూ.10 వేలు ప్రభుత్వం ద్వారా అందుకుంటున్నారు. సంక్షేమ పథకాల కోసం వీరికి అవసరమైన పనులన్నీ గ్రామ సచివాలయం ద్వారానే అందుతున్నాయి. వలంటీర్ ఇంటికి వచ్చి మరీ సేవలందిస్తున్నారు. చెంతనే సచివాలయం ఉండటంతో ఎలాంటి అవినీతికి తావులేకుండా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందుబాటులోకి వచ్చాయని ఆనందంగా చెబుతున్నారు.

నాడు

టీడీపీ హయాంలో ఏ పని కావాలన్నా మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిందే. దీంతో పనులన్నీ మానుకుని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. అక్కడి సిబ్బందికి ముడుపులిస్తే తప్ప.. చాలా పనులు జరగని పరిస్థితి. ఇక రుణాలు, ప్రభుత్వ పథకాలు కావాలంటే జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవాల్సి వచ్చేది.



కొత్తగా నిర్మించిన కొత్తూరు-2 సచివాలయం

నేడు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ సేవల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే బాధల్లేవు. లంచాలు ఇవ్వాల్సిన దుస్థితీ లేదు. సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం సాకారమైంది. ప్రభుత్వ ఉద్యోగులు, వారి సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ సేవలన్నీ గంటల వ్యవధిలో ఉన్న ఊరిలో ఇంటి ముంగిటే అందుతున్నాయి.

మండలంలో సచివాలయ వ్యవస్థ

గ్రామ పంచాయతీలు 32	గ్రామ సచివాలయాలు 26
మంజూరైన సచివాలయ భవనాలు 26	మంజూరైన నిధులు రూ.8.30 కోట్లు
నిర్మాణం పూర్తయిన భవనాలు 26	వలంటీర్ల సంఖ్య 512
గ్రామ సచివాలయ సిబ్బంది 207	సచివాలయాల్లో అందిస్తున్న సేవలు 542

అనకాపల్లి రూరల్: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది. అందుకోసం గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం వైపు అడుగులు వేసింది. రూ.వేల కోట్లు వెచ్చించి సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. పరిపాలనా సౌలభ్యం కోసం ప్రతి 2 వేల మంది జనాభాకు ఒక గ్రామ సచివాలయాన్ని ఏర్పాటు చేసింది. ఎలాంటి ప్రభుత్వ సేవలైనా ఊరు దాటాల్సిన పనిలేదు. మండలంలోని ప్రజలకు వందశాతం సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటే అందుతున్నాయంటే అది గ్రామ సచివాలయ వ్యవస్థ గొప్పతనమేననడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.



పిసినికాడ సచివాలయంలో ప్రజలకు సేవలందిస్తున్న సిబ్బంది



కొత్తూరు1 సచివాలయంలో ఆధార్ నమోదు చేయిస్తున్న సిబ్బంది



విద్యార్థి కులధ్రువీకరణ పత్రానికి దరఖాస్తు చేయిస్తున్న గ్రామ వలంటీర్

ఇది కదా అభివృద్ధి

అందుబాటులో ఉన్న సేవలు

గ్రామ సచివాలయాల్లో ఆదాయ, కుల, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, మ్యుటేషన్, పోలీసు వెరిఫికేషన్, నో ఎర్నింగ్ సర్టిఫికెట్, సదరం దరఖాస్తు, 1బి, అడంగల్, ఆధార్ కార్డులు, రేషన్ కార్డుల నమోదు, టైటిల్ డీడ్, డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సర్టిఫైడ్ కాపీ, విద్యుత్ కనెక్షన్ కేటగిరీ మార్పు, ఇంటి స్థలం, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు, అన్ని రకాల పింఛన్లు, వైఎస్సార్ చేయూత, ఆసరా, కాపునేస్తం, వైఎస్సార్ బీమా, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్నతోడు, వాహన మిత్ర తదితర 542 రకాల సేవలు ఒకేచోట అందుతున్నాయి. వీటిలో చాలా వరకు 15 నిముషాల నుంచి 72 గంటల వ్యవధిలోనే దరఖాస్తుదారులకు అందిస్తున్నారు.



ఇంటి వద్దే పింఛన్ కోసం వివరాలు నమోదు చేస్తున్న వలంటీర్, సచివాలయ సిబ్బంది

మండలానికి వెళ్లే పనిలేదు



సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం మండలానికి వెళ్లే పని తప్పింది. సంక్షేమ పథకాల కోసం వలంటీర్లే దగ్గరుండి మరీ దరఖాస్తు చేయిస్తున్నారు. నాకు వృద్ధాప్య పింఛనుకు అర్హత వయసు రావడంతో మా వలంటీర్ జయంతి ఫణి నా వద్దకే వచ్చి సచివాలయానికి తీసుకెళ్లారు. వృద్ధాప్య పింఛన్‌కు దగ్గరుండి మరీ దరఖాస్తు చేయించారు. పరిశీలన అనంతరం త్వరలోనే పింఛను మంజూరవుతుందని సిబ్బంది చెప్పారు. – మహాశివ కృష్ణంరాజు, కొత్తూరు

అర్జీ పెట్టిన వెంటనే రేషన్ కార్డు



మేము బాగున్నాం అంటే ఈ ప్రభుత్వం చలువతోనే. రేషన్ కార్డు లేని మాకు గ్రామ సచివాలయంలో అర్జీ పెట్టుకున్న వెంటనే ప్రభుత్వం నుంచి మంజూరైంది. గతంలో ఎందరినో ముఖ్యమంత్రులను చూశాం. కానీ మాలాంటి పేదల బతుకుల్ని బాగు చేయాలని తపించే సీఎం జగన్ మాత్రమే. రేషన్ కార్డుతో పాటు ఆరోగ్యశ్రీ కార్డు కూడా మంజూరైంది. – మళ్ల అనూరాధ, పిసినికాడ

రైతు భరోసా, అమ్మఒడి వస్తున్నాయి



మా కుమారుడు సుజన్‌బాబుకు అమ్మఒడి, నా భర్తకు రైతు భరోసా వచ్చాయి. సచివాలయం ద్వారానే దరఖాస్తు చేసుకున్నాం. వెంటనే పరిశీలించి, పథకాలు మంజూరు చేశారు. సచివాలయం ద్వారా అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, ఇతర సేవలు అందడంతో మండల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అవసరం లేకుండాపోయింది. – దాడి నాగలక్ష్మి, పిసినికాడ

చిరస్మరణీయుడు గురునాథరావు

- మాజీ మంత్రి దివంగత గురునాథరావు వర్ధంతి కార్యక్రమాల్లో నేతలు



పేద మహిళకు దుప్పటి అందిస్తున్న జానకీరామరాజు, రామ్మూర్తి



తాళ్లపాలెంలో మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు చిత్ర పటానికి నివాళులు

అనకాపల్లిటౌన్: నిస్వార్థ రాజకీయాలకు మారుపేరుగా గుడివాడ గురునాథరావు చరిత్రలో నిలిచిపోయారని ఎన్టీఆర్ వైద్యాలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం దివంగత గురునాథరావు 22వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముందుగా పట్టణపార్టీ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణతో కలిసి గురునాథరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ గురునాథరావు రాజకీయాలను అందిపుచ్చుకుని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ రాజకీయంగా ఎంతో ఎత్తుకు ఎదిగారని కొనియాడారు. అంతకు ముందు పేదలకు మందపాటి జానకీరామరాజు దుప్పట్లు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో ఆలయాల చైర్మన్‌లు కె.ఎం.నాయుడు, సుదురుపాటి తాతాజీ, సకలా గోవింద, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ మునూరు శ్రీను, రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ విభాగం కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనర్సింహారావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, పార్టీ శ్రేణులు ఉగ్గిన అప్పారావు, గుండా రమేష్‌గుప్తా, జోగిరాజు, కోన ఉమ, పలకా వాసు, మాధురినాయుడు, కల్యాణ్, అల్లు త్రినాథ్, మహాలక్ష్మినాయుడు, డొంక సత్య, పిట్టా అప్పలరాజు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక పంచాయతీ కార్యాలయంలో దివంగత మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురునాథరావు చిత్ర పటానికి పూలమాల వేసి వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు నివాళులర్పించారు. సర్పంచ్ మంత్రి జయరజని, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, పార్టీ శ్రేణులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

- మండలంలోని తాళ్లపాలెం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, పాల సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు లగిశెట్టి గణేష్, మట్టా సత్యనారాయణ తదితరులు గురునాథరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- కన్నూరుపాలెంలో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో గుడివాడ విగ్రహానికి పూలమాల వేసి జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు నివాళులర్పించారు. సర్పంచ్ శివ పాల్గొన్నారు.

జగన్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి



మామిడిపాలెంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు



కోట్నివీధిలో పార్టీ జెండా ఆవిష్కరణలో బొడ్డేడ ప్రసాద్, దిలీప్‌కుమార్ తదితరులు



ఉగ్గినపాలెంలో అభివృద్ధి, సంక్షేమ లబ్ధి ఫ్లెక్సీని ఆవిష్కరించిన దంతులూరి దిలీప్‌కుమార్

- 'వై ఏపీ నీడ్స్ జగన్'లో వైఎస్సార్‌సీపీ నేతలు

అనకాపల్లిటౌన్: రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే జగన్‌కే దక్కుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. పట్టణంలో 10వ సచివాలయం పరిధి కోట్నివీధిలో బుధవారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న బొడ్డేడ మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలకు పూర్తి స్థాయిలో న్యాయం చేసిన ఏకైక సీఎం జగనేనని కొనియాడారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో అత్యాధునిక వైద్యపరికరాలు ఏర్పాటు చేసి పేదలకు వైద్యాన్ని దగ్గర జగన్ చేశారన్నారు. అంతకు ముందు సంక్షేమ పథకాల లబ్ధి వివరాలతో ఏర్పాటు చేసిన బోర్డును ప్రారంభించారు. పార్టీ జెండాను ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులు ఉమ్మిన పైడిరాజు, మాధురి నాయుడు, పిల్లల శివ అప్పారావు, చింతల వాసు, ఆర్.మల్లేశ్వరరావు, పూడి సూరిబాబు, మొల్లి శ్రీను, విజయ్‌శంకర్, సతీష్, వాయిబోయిన నాగు, ఆవుపాటి మల్లేశ్వరరావు, అయితా సన్యాసిరావు, నూకాంబిక ఆలయ డైరెక్టర్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

మామిడిపాలెంలో...

సంక్షేమ సారథిగా జగన్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని మామిడిపాలెం గ్రామ సచివాలయంలో నిర్వహించిన ఏపీకి జగనే ఎందుకు కావాలంటే .. కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌ను గెలిపించుకోవడం ద్వారా మరింత అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు అందుతాయన్నారు. విద్య, వైద్యంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చించింది తమ ప్రభుత్వమేనన్నారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని చేరువ చేసింది సీఎం జగనేనని కొనియాడారు. తొలుత స్థానికంగా అభివృద్ధి, సంక్షేమ లబ్ధి వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. సచివాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి, గ్రామస్తులకు జగనే ఎందుకు కావాలంటే బ్రోచర్లను అందించారు, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు సేనాపతి హరికృష్ణ, ఎంపీటీసీ బంధం అప్పలనాయుడు, ఎంపీడీవో కె.నరసింహారావు, ఈవోపీఆర్డీ ధర్మారావు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

కశింకోట: గతంలో ఎన్నడూ లేని విధంగా మారుమూల గ్రామాలను సైతం కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసిన ఘన సీఎం జగన్‌కే దక్కుతుందని ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. మండలంలోని ఉగ్గినపాలెం సచివాలయంలో ఎంపీపీ కలగా లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సచివాలయ పరిధిలో రూ.30.56 కోట్లతో ప్రత్యక్ష, పరోక్షంగా అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల లబ్ధిని తెలిపే ఫ్లెక్సీని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ అర్హులందరికీ నవరత్నాలతోపాటు, పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో నాలుగున్నరేళ్లలో ఉగ్గినపాలేన్ని ఎంతగానో అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. నిరంతరం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జనరంజక పాలన అందిస్తున్న జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించుకునేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు మాట్లాడుతూ సీఎం జగన్ అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. పార్టీ మండల సచివాలయ కన్వీనర్, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు మాట్లాడుతూ తమ సచివాలయం పరిధిలో గత నాలుగున్నరేళ్లలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, వైస్ ఎంపీపీలు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, ఎంపీడీవో వీవీ రవికుమార్, ఈవోఆర్డీ సోమరాజు, సర్పంచ్‌లు కోన నాయుడు, శ్యాంసన్, బుచ్చియ్యపేట పాల సంఘం అధ్యక్షుడు బుదిరెడ్డి రాజు, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, పార్టీ నాయకుడు నమ్మి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి



రహదారిపై వేసిన పూడికను పరిశీలిస్తున్న సునీత, జానకీరామరాజు, వెంకటరమణ

అనకాపల్లిటౌన్: డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత అధికారులను 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత సూచించారు. వార్డు పరిధిలో న్యూకాలనీలో ఆమె బుధవారం పర్యటించారు. కాలనీలో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండటాన్ని కాలనీవాసులు ఆమె దృష్టికి తెల్లారు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చడంతోపాటు విద్యుత్ సమస్యను నివారించాలని జీవీఎంసీ అధికారులను ఆమె ఆదేశించారు. రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించి కాలువలను నిర్మించాలన్నారు. ఆమె వెంట వార్డు ఇన్‌చార్జి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జెడ్సీ ఎస్.వెంకటరమణ, ఏఈ సుమిత్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

ఎంపీపీ ఆకస్మిక తనిఖీలు



గోరుముద్దను పరిశీలిస్తున్న ఎంపీపీ సూరిబాబు

అనకాపల్లిటౌన్: మండలంలో మార్టూరు అంగన్‌వాడీ కేంద్రం టీచర్‌పై ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులు, స్టాక్ రిజిస్టర్, కేంద్రంలో నిల్వ ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. చిన్నారులతో కాసేపు గడిపి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయునిగా మారి టెన్త్ విద్యార్థులను లెక్కలు, ఫిజిక్స్‌పై ప్రశ్నలు అడిగి, సమాధానాలు రాబట్టారు. పేద విద్యార్థులకు ఉత్తమ విద్య అందించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని, ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసి విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకు కృషి చేయాలని కోరారు. జగనన్న గోరుముద్ద వంటకాలను రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సర్పంచ్ రెవెన్యూనాయుడు, ఏఎంసీ డైరెక్టర్ ఒమ్మి మధుబాబు, పార్టీ శ్రేణులు కరణం కృష్ణ, పోల్నాటి కాసుబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాధర్నా విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వైఎన్ భద్రం

అనకాపల్లి రూరల్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా విజయవాడలో ఈ నెల 27, 28 తేదీల్లో చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వైఎన్ భద్రం పిలుపునిచ్చారు. కె.గోవిందరావు భవనంలో బుధవారం నిర్వహించిన రైతు, కార్మిక సంఘాల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర సమితి సభ్యుడు గనిశెట్టి ఏసుదాసు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అమలుచేస్తోందని ఆరోపించారు. కార్పొరేట్, పారిశ్రామికవేత్తలకు భుజం కాస్తోందని ఆక్షేపించారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి, అదానీ, అంబానీలకు లబ్ధి చేకూర్చుతోందన్నారు. కార్మికుల ప్రాణత్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కుదించడం అన్యాయమన్నారు. ఈ మహాధర్నాకు అందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు రైతు నాయకులు, ఏఐటీయూసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

26న విశాఖలో రాధాకృష్ణ ఉత్సవం

అనకాపల్లి టౌన్: విశాఖ బీచ్ శ్రీరంగపురంలో రాధాకృష్ణ ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు తెలిపారు. స్థానిక సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 26న జరిగే ఉత్సవానికి యాదవులంతా పాలు, పెరుగు వెంట తీసుకు రావాలని సూచించారు.